క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గ పరిధిలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాలకు చెందిన గ్రామ పంచాయతీల పారిశుద్ధ్య, విద్యుత్ సిబ్బంది 535 మందికి ఎమ్మెల్యే బోడెప్రసాద్ దుస్తులు పంపిణీ చేశారు. స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా గంగూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య సిబ్బంది గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా మార్చాలని సూచించారు. కార్యక్రమంలో ఉయ్యూరు డీఎల్‌డీవో రాజేష్, పెనమలూరు ఎంపీడీవో డాక్టర్ బండి ప్రణవి, కంకిపాడు, ఉయ్యూరు, పెనమలూరు మండలాల పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ బోర్డు ఏర్పాటు చేయాలి



పెనమలూరు: ఆక్యుపంక్చర్ బోర్డును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే ఏర్పాటు చేయాలని ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ ఆఫ్ భారత్ సభ్యుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ కోరారు. కానూరు అశోక్‌నగర్‌లోని ఇండియన్ ఓం కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆక్యుపంక్చర్ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. వరల్డ్ ఆక్యుపంక్చర్ డేను విశేషంగా నిర్వహించి విశిష్ట కృషి చేసిన వారికి అవార్డులు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఏపీ జెన్‌కో చీఫ్ ఇంజినీర్ రాజారావు ప్రారంభించారు. కమిటీ సభ్యులను ఘనంగా సన్మానించారు.

వైద్య శిబిరానికి స్పందన కరువు



రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం గూడవల్లి పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరానికి స్పందన కరువైంది. స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. వ్యాధులు పరీక్ష చేయించుకోవడానికి జనాలు రాకపోవడంతో వైద్య సిబ్బంది ఖాళీగా కూర్చుని టైమ్ పాస్ చేశారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ముందస్తు ప్రచారం చేయకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని పలువురు విమర్శించారు. కనీసం గ్రామంలోని వైద్య సిబ్బంది కూడా శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు గ్రామస్తులకు సమాచారం ఇవ్వలేదని వాపోతున్నారు. దీంతో కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహించి ముగించేయడం విమర్శలకు తావిస్తోంది.

లైట్ హోం ఆసుపత్రి ప్రారంభం



గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి గ్రామంలో లైట్ హోం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆస్పత్రిని సోమవారం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. లైట్ హోం ఆధ్వర్యంలో పేదలకు, విద్యార్థులకు ఎంతో మేలు చేస్తున్న వ్యవస్థాపకుడు చౌటపల్లి ఎలీషాను ఆయన అభినందించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కోటగిరి వరప్రసాదరావు, సర్పంచ్‌లు గణపవరపు శాంతి, అన్నే లక్ష్మణరావు, సహకార బ్యాంకు అధ్యక్షుడు బోయపాటి మురళీకృష్ణ, లైట్ హోం సిబ్బంది పాల్గొన్నారు.



కంకిపాడు శివాలయంలో సరస్వతీ దేవి అలంకరణ



ఉయ్యూరు శివాలయంలో సరస్వతీ దేవిగా అమ్మవారు



శ్రీమహాగౌరీదేవిగా యనమలకుదురులోని అమ్మవారు



పెదఓగిరాలలో సరస్వతి దేవి అలంకారంలో భ్రమరాంబ



గన్నవరంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సరస్వతి దేవి అలంకరణ

శ్రీవిద్యాస్వరూపిణీ.. జ్ఞాన ప్రదాయినీ

- అమ్మవారి మూలా నక్షత్రం సందర్భంగా కిటకిటలాడిన ఆలయాలు
- శ్రీ సరస్వతీదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



చినకంచిలో బాలదుర్గలుగా బాలికలు



కానూరులో కుంకుమ పూజ చేస్తున్న భక్తులు



సరస్వతీ దేవిగా పేరంటాలమ్మ

గన్నవరం: శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి మూలా నక్షత్రం పురస్కరించుకొని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో అమ్మవారిని శ్రీజ్ఞాన సరస్వతిదేవిగా అలంకరించి పూజలు చేశారు. విద్యార్థులచే శ్రీలక్ష్మీహయగ్రీవ, శ్రీసరస్వతిదేవి మూల మంత్ర హోమం నిర్వహించి పెన్నులు, పుస్తకాలు పంపిణీ చేశారు. స్థానిక పాత గన్నవరంలోని శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో శ్రీసరస్వతిదేవికి పూజలు నిర్వహించారు. స్థానిక సొసైటీ పేటలోని శ్రీగాయత్రి అమ్మవారి మందిరంలో సరస్వతి హోమం చేయడంతో పాటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. దావాజీగూడెంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానంలో విద్యార్థులు శ్రీసరస్వతిదేవికి కుంకుమార్చనలు చేశారు.

సరస్వతీ.. నమస్తుభ్యం

కంకిపాడు: సరస్వతీ.. నమస్తుభ్యం అంటూ భక్తజనం సోమవారం అమ్మవారికి పూజలు చేశారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కంకిపాడు శివాలయంలో తుమ్మలపల్లి హరికృష్ణ వితరణతో భక్తులకు అన్నసంతర్పణ జరిపించారు. అమ్మవారిని కోలవెన్ను మాజీ సర్పంచ్ తుమ్మల చంద్రశేఖర్ దర్శించుకుని రూ.25 వేలు విరాళం అందించారు.

ఉయ్యూరు: దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు సరస్వతీ దేవిగా పూజలందుకున్నారు. అమ్మవారికి భక్తులు కుంకుమపూజలు జరిపించి భక్తిపారవశ్యం చెందారు.

పెదఓగిరాల్లో..

ఉయ్యూరురూరల్: మండలంలోని పెదఓగిరాల్లో సోమవారం శ్రీ భ్రమరాంబ మల్లికార్జునస్వామి వార్ల దేవస్థానంలో అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమార్చన అనంతరం భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

మహాగౌరీదేవిగా పార్వతీ అమ్మవారు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం పార్వతీ అమ్మవారిని శ్రీమహాగౌరీదేవిగా అలంకరించారు. అనంతరం చండీహోమం, కుంకుమ పూజలు నిర్వహించారు. కానూరు తిరుపతమ్మగుడిలో, చోడవరం శ్రీనాగేంద్రస్వామివారి ఆలయం, యనమలకుదురు శ్రీకనకదుర్గమ్మ ఆలయం, పోరంకి గంగానమ్మ తల్లిగుడి, షిర్డీ సాయిబాబా మందిరం, పెదపులిపాక విజయరాజరాజేశ్వరి ఆలయంలో అమ్మవార్లను శ్రీ సరస్వతీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

సామూహిక అక్షరాభ్యాసాలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో సోమవారం అమ్మవారు శ్రీ సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు పేరంటాలమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

చినకంచిలో..

నున్న(విజయవాడరూరల్): ప్రసిద్ధ చినకంచి చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి దేవస్థానంలో సోమవారం శ్రీకామాక్షి అమ్మవారు భక్తులకు సరస్వతీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. 12 మంది బాలికలను మహాకాళి, మహాలక్ష్మీ, మహాసరస్వతీ నవదుర్గలుగా బాలపూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. చెరువు సెంటర్లోని కనకదుర్గమ్మ సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. అంబాపురం, పి.నైనవరం, పాతపాడు శివారు అప్పారావుపేట, మంగళాపురం గ్రామాల్లో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయం, ఐటీఐ రోడ్డులోని శ్రీభమరాంబ సమేత శ్రీశైలమల్లికార్జున స్వామి ఆలయం, ఏలూరురోడ్డులోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉత్సవ మండపాల్లో సరస్వతి దేవి వద్ద విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు.

సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం కానుమోలులోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో సరస్వతి దేవి విగ్రహం వద్ద సోమవారం విశేష పూజలు నిర్వహించారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతి దేవికి విగ్రహ దాత, విశ్రాంత ఉద్యోగి కళ్లేపల్లి నారాయణరావు, లక్ష్మీ దంపతుల నేతృత్వంలో పూజలు చేశారు. పీఏసీఎస్ చైర్మన్ దన్నె దుర్గారావు, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు, దస్తావేజు లేఖరి ఎస్‌వీఎస్ గంగాధరరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పెదఓగిరాలలో సామూహిక సీమంతాలు



గోసాలలో ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


ఉయ్యూరురూరల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని చిన ఓగిరాల పీహెచ్‌సీ వైద్యులు ఇంద్రావతి పేర్కొన్నారు. మండలంలోని పెదఓగిరాల పాఠశాలలో రాష్ట్రీయ పోషణ్ మహోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ త్రిపురం లక్ష్మి, డాక్టర్ ఇంద్రావతి పాల్గొని మాట్లాడారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడంలో తల్లుల పాత్ర కీలకమని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని, పాఠశాల ప్రిన్సిపాల్ టి.శైలజ, మహిళా సంరక్షణ కార్యదర్శి ఉమా దీప్తి, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోసాలలో అవగాహన ర్యాలీ

పెనమలూరు: అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతోపాటు విద్యా బోధన చేస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్. సులోచనరాణి అన్నారు. గోసాల సెక్టార్ 7 నెంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 8వ రాష్ట్రీయ పోషణ 2025లో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్ గురించి వివరించారు.

మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చుకుని ప్రత్యేక ఐడీ ద్వారా చిన్నారి పేరు నమోదు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో తల్లులు, గర్భిణులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దుర్గమ్మకు నృత్య నీరాజనం



నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడకల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనకదుర్గానగర్‌లోని కళా వేదికపై ప్రదర్శిస్తున్న సంగీత, నృత్య కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. మూలా నక్షత్రం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో వీక్షించిన కార్యక్రమాలు ఉదయం 10 గంటలకు ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు సాగాయి. ఎన్‌వీ నాగయ్య తాళం భజనతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. భక్తిరంజని కార్యక్రమంలో భాగంగా ఎంఎస్‌ఆర్‌వీ ప్రసాద్, ఎ.సాహితీ, జి.కావ్య బృందం, హైదరాబాద్‌కు చెందిన హనుమంతరావు శివ భక్త విజయం కథనం శ్రావ్యంగా వినిపించారు. వైఎస్ వీకే సంతోష్ బృందం వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు.

నయనానందకరం సాంస్కృతిక మహోత్సవం



విజయవాడ కల్చరల్: విజయవాడ దుర్గాపురంలోని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు నయనానందకరంగా సాగుతున్నాయి. సోమవారం నాటి కార్యక్రమంలో విఖ్యాత నాట్యాచార్యుడు భాగవతుల వెంకట్రామశర్మ బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. కావ్య బృందం కూచిపూడి సంప్రదాయంలో అన్నమయ్య కీర్తనలను నృత్యాలను అభినయించారు. చిప్పాడ నాగేశ్వరరావు ఘంటసాల పాటలను మధురంగా ఆలపించారు. శ్రీకాకుళానికి చెందిన సత్తిరాజు తప్పెటగుళ్లు లయబద్ధంగా వినిపించారు. పాప దొరికింది నాటకాన్ని కళాకారులు ప్రదర్శించారు. తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శ్రీలలితా నాట్య కళాబృందం కూచిపూడి సంప్రదాయంలో నృత్యాలను ప్రదర్శించింది. సంగీత విద్వాంసుడు ఏసురాజు క్లారినెట్ వాయిద్యాన్ని, రాజీవ్ సోదరులు డప్పు అంశాన్ని ప్రదర్శించగా కళాకారులు జగదేక సుందరి సామా పౌరాణికాన్ని ప్రదర్శించారు.

రిలే దీక్ష విరమించిన ఎలుకపాడు భూబాధితులు



ఉంగుటూరు(గన్నవరం): ఉంగుటూరు మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం వద్ద ఎలుకపాడు అసైన్‌మెంట్ భూబాధితులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలను డెప్యూటీ తహసీల్దారు హామీ మేరకు విరమించారు. గ్రామానికి చెందిన పేదలకు 1980లో అసైన్‌మెంట్ కమిటీ తీర్మానం మేరకు భూములు కేటాయించినప్పటికి ఇప్పటి వరకు 40 మందికి ఆన్‌లైన్ చేయలేదు. దీంతో ప్రభుత్వం ఇస్తున్న అన్నదాత సుఖీభవ, ప్రకృతి విపత్తుల సమయంలో ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం అందడం లేదు. తమ భూములను ఆన్‌లైన్ చేయాలని బాధితులు గత 20 రోజులుగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్నారు. దీంతో డెప్యూటీ తహసీల్దారు చిట్టిబాబు వీరి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో తాత్కాలికంగా దీక్ష విరమిస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. పవన్‌కుమార్ తెలిపారు. సంఘ నేత అజ్మీరా వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం సోమవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి హాజరయ్యారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ పాలక మండలి నూతన చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు అభయాంజనేయస్వామి చిత్రపటాన్ని మంత్రికి బహూకరించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, జనసేన పార్టీ గన్నవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ చలమలశెట్టి రమేష్‌బాబు, పెదపాడు జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి రామసీత, ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు పటిష్ట చర్యలు

ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్



కంకిపాడు: ధాన్యం కొనుగోళ్లు సమర్థంగా సాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఉయ్యూరు ఆర్డీఓ హెలా షారోన్ తెలిపారు. కంకిపాడు మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోళ్లపై సోమవారం మిల్లర్లు, రైతులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ గత సీజన్‌లో రవాణా వాహనాలు, గోనె సంచులు సమకూర్చడంలో వైఫల్యం జరిగిందని వాపోయారు. సకాలంలో రవాణా వాహనాలు ఏర్పాటు చేయకపోవడంతో కల్లాలు, రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షాలకు తడిచిపోయి తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ధాన్యం తేమశాతం నమోదులో మిల్లర్లు ఇబ్బందులకు గురిచేశారని, ఈసారి ఇబ్బందులు లేకుండా చూడాలని విన్నవించారు. ఆర్డీఓ హెలా షారోన్ మాట్లాడుతూ గత సీజన్‌లో తలెత్తిన సమస్యలను అధికమించేలా చూస్తామన్నారు. వరి కోతల విషయంలో సంయమనం పాటించాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ అన్నే ధనయ్య, వ్యవసాయశాఖ ఏడీ స్వర్ణలత, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గురువులు దైవ సమానులు

పెనమలూరు: సమాజంలో విద్యను అందించే గురువులు, వైద్యులు, న్యాయవాదులు దైవ సమానులని విజయవాడ ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు స్వామి చక్రధారిదాస్ అన్నారు. కానూరు సిద్ధార్థ డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో సోమవారం మూలా నక్షత్రం సందర్భంగా సరస్వతీదేవి విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తన ఉపన్యాసంలో గురుశిష్యుల సంబంధం చాలా ఉత్తమమైనదని చెప్పారు. సమాజంలో అందరూ ఉన్నత సంబంధాలతో కొనసాగి కలిసిమెలిసి జీవించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపకులపతి డాక్టర్ పి.వెంకటేశ్వరరావు, ప్రో ఉపకులపతి డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ బి.పాండురంగారావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎం.రవిచంద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ గీతా బోధ అవసరం

హనుమాన్‌జంక్షన్ రూరల్: యువతతో పాటుగా నేటి సమాజంలో ప్రతి ఒక్కరికీ గీతా బోధ అవసరమని హరేకృష్ణ గోకుల క్షేత్రానికి చెందిన వంశీధర్ దాస్ ప్రభుజీ అన్నారు. స్థానిక ఏలూరురోడ్డులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని శివశక్తి, ఆర్యవైశ్య సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం భగవద్గీత ప్రవచనం నిర్వహించారు. దీనికి హాజరైన ఆయన మానవ జీవన విధానం, ముక్తిమార్గాలను భగవద్గీత బోధిస్తుందని వివరించారు. రామసేతు కార్యకర్తలు, శివశక్తి సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ మండల సహ కన్వీనర్ దావులూరి శ్రీహరి, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

నున్నలో ఆర్అండ్‌బీ రోడ్డు సర్వే

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో సోమవారం ఆర్అండ్‌బీ రోడ్డు సర్వే చేశారు. రెండు నెలల క్రితం నున్న గ్రామంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ పర్యటించిన సందర్భంలో ఆక్రమణల గురించి స్థానికులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో గ్రామంలో మ్యాంగ్ మార్కెట్ నుంచి నున్న చెరువు సెంటర్ వరకు ఆర్అండ్‌బీ రోడ్డు సెంటర్ డివైడర్ నిర్మించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా ఆర్అండ్‌బీ సర్వే చేస్తున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.